క్లుప్తంగా

డిప్యూటీ డీఈఓ బాధ్యతల స్వీకరణ


డిప్యూటీ డీఈఓ నాగరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి: గుత్తి డిప్యూటీ డీఈఓగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు ఉషారాణి, సుబహాన్, ఉపాధ్యాయుడు దేశాయి నాగరాజు తదితరులు డిప్యూటీ డీఈఓకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. శాలువాలు,పూలమాలలతో సత్కరించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగ విరమణ


రంగయ్య దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్

గుత్తి: గుత్తి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఆధ్వర్యంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, శానిటేషన్ కార్మికులు రంగయ్య, ఆయన సతీమణి సుజాతను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ వరలక్ష్మి, కౌన్సిలర్ ఫరూక్ రంగయ్య సేవలను కొనియాడారు.

పారా అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయికి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి: గుత్తి కోటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తిరుమల అనే విద్యార్థి పారా అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం సుబహాన్ తెలిపారు. షాట్ పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రోలో ప్రతిభ కనబరచడంతో తిరుమల జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కోట ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థి తిరుమలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గుత్తి కోట సందర్శన


గుత్తి కోటలో మన్రో సమాధిని సందర్శిస్తున్న హీరోయిన్, నిర్మాత

గుత్తి: హీరోయిన్ చౌదరి శ్రావణి, లక్ష్మీకటాక్షం నిర్మాత శ్రీనివాసరెడ్డి, పలువురు సినీ ఆర్టిస్టులు శుక్రవారం గుత్తికోటను సందర్శించారు. ఈ సందర్భంగా వారు కోటలోని అన్ని చారిత్రక ప్రాంతాలను పరిశీలించారు. అలాగే మన్రో సమాధిని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా హీరోయిన్ చౌదరి శ్రావణి, నిర్మాత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గుత్తి కోట చాలా బాగుందని కితాబిచ్చారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మురుగులో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ సెక్రటరీ గంగ మహేశ్వర రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో సచివాలయ, ఆరోగ్య సిబ్బంది సందర్శించి నిల్వ ఉన్న మురుగునీటిపై బ్లీచింగ్ పౌడర్, సున్నపు పొడి చల్లించడంతో పాటు దోమల మందు పిచికారీ చేశారు. పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తం


గుంతకల్లు మండలం
నాగసముద్రం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తాడిపత్రిలో విద్యార్థులకు
అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ


శింగనమల మండలం
వెస్ట్ నరసాపురంలో కలుషిత నీటిని పారబోస్తున్న దృశ్యం

- గ్రామాల్లో వైద్య సిబ్బంది ర్యాలీలు
- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన

గుంతకల్లు రూరల్: డయేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రశాంత్ సూచించారు. శుక్రవారం మండలంలోని నెలగొండ గ్రామంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. వైద్యుడు మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆహారం, నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీదా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తాడిపత్రి: పరిశుభ్రతతో పాటు స్టాప్ డయేరియాపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ దస్తగిరమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులను సబ్బుతో తరచూ కడుక్కోవడం వలన డయేరియా ప్రబలే అవకాశాలు ఉండవన్నారు. అలాగే రహదారుల పక్కగా విక్రయించే తినుబండారాలను తినడం వలన కూడా డయేరియా వచ్చే అవకాశం ఉందని, వీలైనంత వరకు వేడి ఆహారాలను ఇంట్లోనే తినాలన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, ఎంఎస్‌కే రసూల్ బీ, అంగన్‌వాడీ కార్యకర్త సౌజన్య, ఆశా వర్కర్ లక్ష్మిలు పాల్గొన్నారు.

డయేరియా నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరం

గార్లదిన్నె: డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరమని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పెనకచెర్లలో డయేరియాపై వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేశారు. ఈ సందర్భంగా వైద్య


గార్లదిన్నె మండలం పెనకచెర్లలో
అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సిబ్బంది ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై ప్రజలకు వివరించారు. అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య మాట్లాడుతూ డయేరియా రాకుండా ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వాంతులు, విరేచనాలు, జ్వరం వస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించి మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ అరుణజ్యోతి, ఏఎన్ఎం దుర్గాభవాని, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రై డే

శింగనమల: డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్‌నాయక్ సూచించారు. డ్రైడే సందర్భంగా శుక్రవారం మండలంలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించి, కలుషిత నీరు పారబోశారు. ఆయన మాట్లాడుతూ డయేరియా రాకుండా ఆహారం, నీరు కలుషిత కాకుండా చూసుకోవాలన్నారు. కలుషిత నీరు తాగినా, ఆహారం తీసుకున్నా డయేరియా సోకే ప్రమాదం ఉందన్నారు. నీటిని కాచి తాగాలన్నారు. అనంతరం గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వణి, సూపర్‌వైజర్లు అశ్వర్థ, నాగమ్మ, హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయండి

శింగనమల: శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని యువకులు కోరారు. క్రీడా మైదానం చుట్టూ మొక్కలు పెంపకానికి యువకులు శుక్రవారం నడుం బిగించారు. కళాశాల క్రీడా మైదానం చుట్టూ గతంలో మొక్కలు నాటిన యువకులు మరోసారి మొక్కలు కొనుగోలు చేసి, క్రీడా మైదానం చుట్టూ నాటారు. వారు మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు నాటితో బాగా బతుకుతాయన్నారు.

ప్రహరీ నిర్మించండి

కళాశాలకు ప్రహరీ ఉన్నా, కొన్ని చోట్ల అకతాయిలు పడగొట్టారు. దీంతో కళాశాల క్రీడా మైదానంలోకి పశువులు, పందులు వస్తున్నాయని, దీంతో పాటు కొందరు కాలకృత్యాలకు ఉపయోగించుకుంటున్నారని యువకులు వాపోయారు. అలాగే సాయంత్రం పూట మద్యం ప్రియులకు బార్‌గా తయారైందన్నారు. అక్కడే తాగడం, తాగిన తరువాత సీసాలను పగలగొడుతున్నారన్నారు. మైదానంలో క్రీడలు ఆడాలంటే ఎక్కడ చూసినా పగిలిన గాజులు ఉన్నాయన్నారు. క్రీడా మైదానం దాదాపు నాలుగు ఎకరాలు ఉందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని క్రీడాకారులు , యువకులు కోరారు. అలాగే ప్రహరీ ధ్వంసమైన చోట మరమ్మతులు చేయాలన్నారు.


శింగనమల కళాశాల ఆవరణలో
మొక్కలు నాటుతున్న యువకులు

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన

పెద్దవడుగూరు: మండలంలోని బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని, పనిలో కాదని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని కాశేపల్లిలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా వారు పర్యటించారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను గురించి వివరించారు. 15 లోపు పిల్లలు తప్పకుండా బడికి పోయేలా పిల్లల తల్లితండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గుత్తి అనంతపురం, మిడుతూరు గ్రామాల్లోని పాఠశాలలను వారు పరిశీలించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాణ్యమైన విద్య అందించడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.


కాశేపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న
ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్

కూచిపూడి కళాకారులకు సన్మానం

తాడిపత్రి అర్బన్: ఇటీవల బద్రీనాథ్, కేదార్‌నాథ్ పుణ్యక్షేత్రాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులు, అర్చకులు, యాత్రికులను అబ్బురపరిచి భారత్‌బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకున్న తాడిపత్రికి చెందిన వందన డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులను శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సేవా సంస్థ సభ్యులు సన్మానించి అభినందించారు. డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు వందనతో పాటు ఆమె భర్త ప్రవీణ్, నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులు సాయిమైత్రి, జ్యోషిత, వర్ధిని, నవ్య, సాహిత్య, నిహారికకు జ్ఞాపికలను అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో చిన్నారులు మరిన్ని అద్భుత ప్రదర్శనలు చేసి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, కన్వీనర్ శంకర్, తదితర సభ్యులు పాల్గొన్నారు.


భారత్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన చిన్నారులతో
సామాజిక సంస్థ సభ్యులు

అన్ని పంటలకూ బీమా అమలు చేయాలి

తాడిపత్రి అర్బన్: సాగు చేసిన అన్ని పంటలకు పంట బీమా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ కమిటీ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ క్రాప్ ఆధారంగా నమోదు చేసుకున్న ప్రతి పంటకు బీమా వర్తింప చేయాలని కమిటీ నాయకులు కోరారు. ప్రకృతి విపత్తులను పరిగణంలోకి తీసుకుని బీమా వర్తింపచేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని గత మూడు సంవత్సరాల్లో బాధ్యతగా తీసుకుని రూ.వేల కోట్ల రైతులకు ఖాతాలో జమ చేసిందన్నారు. ఆ పద్ధతిని టీడీపీ ప్రభుత్వం కూడా అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం వంతున బాధ్యతగా తీసుకుని పంటల బీమా ప్రీయం చెల్లించాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ బీమా సంస్థలను పక్కనపెట్టి ప్రభుత్వ రంగ భీమా సంస్థలను అనుమతించాలని కోరారు. పంట నష్ట అంచనాల్లో రెవెన్యూ వ్యవసాయశాఖ అధికారుల నివేదిక ఆధారంగా రైతులకు పంట పరిహారం చెల్లించాలన్నారు.

తొండపాడులో పశువులకు గర్భకోశ పరీక్షలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో శుక్రవారం పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. అనంతపురం డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి డాక్టర్ టీవీ సుధాకర్, డాక్టర్ భారతి, గుత్తి పశువైద్యుడు డాక్టర్ ప్రదీప్ పశువైద్య శిబిరంలో సుమారు 60 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేసి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. 80 పశువులకు ముద్దచర్మ వ్యాధికి టీకాలు వేశారు. 35 పశువులకు గర్భకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సుధాకర్ పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ 90 శాతం కచ్చితత్వంతో పెయి దూడల పుట్టుకను ఉద్దేశించి లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు ప్రాచుర్యం నిమిత్తం వైద్య శిబిరం నిర్వహించామన్నారు. పెయి దూడలు పొందే రూ.1.350 విలువ గల రెండు సూదులను రూ.850 సబ్సిడీతో రైతులకు రూ.500కే అందిస్తామన్నారు. రెండు సూదులు వేసినా దూడలు పుట్టకపోతే రైతుకు రూ.500 వెనక్కు ఇస్తామన్నారు. ఒకవేళ కుర్రదూడ పుడితే రూ.250 వెనక్కు ఇస్తామన్నారు. విదేశీ జాతులనే కాక, స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పార్కార్ బ్రీడ్‌లను రైతులు ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రపంచ స్థాయిలో పోటీ పడాలి

అనంతపురం ఎడ్యుకేషన్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో టాటా స్ట్రైవ్, సీమెన్స్, డ్యూయల్ వీఈటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'స్కిల్ కాంపిటీషన్' పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేఘ స్వరూప్ పోటీలను ప్రారంభించారు. అయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న అనేక రంగాల్లో మనకు ఇష్టమైన రంగాన్ని ఎంపిక చేసుకుని రాణించాలన్నారు. ఐటీఐల్లో విద్యార్థులు మరిన్ని మెలకువలు నేర్చుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఐఎంసీ సభ్యుడు శేషాంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ స్కిల్ కాంపిటీషన్‌లో మొత్తం 38 ప్రాజెక్టులను ప్రదర్శించడం జరిగిందన్నారు. జోన్-4 పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించిన డీవీఈఓ వెంకటరమణ నాయక్ విజేతలను ఎంపిక చేశారు.


పోటీలను ప్రారంభిస్తున్న
నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్

విజేతలు వీరే..

ప్రభుత్వ బాలుర ఐటీఐ (అనంతపురం) విద్యార్థులు రూపొందించిన 'ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్', ప్రభుత్వ బాలికల ఐటీఐ (అనంతపురం) విద్యార్థినులు రూపొందించిన 'ఆల్కహాల్ డిటెక్షన్ సెన్సార్' ప్రాజెక్ట్ ప్రథమ స్థానం, సాయి వెంకటేశ్వర ఐటీఐ విద్యార్థులు రూపొందించిన 'ఆటోమేటిక్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్' ప్రాజెక్ట్ ద్వితీయ స్థానం, ప్రభుత్వ ఐటీఐ గుంతకల్లు విద్యార్థులు రూపొందించిన 'గ్రీన్ హైడ్రోజన్ వెహికల్' మూడో స్థానంలో నిలిచాయి.

పారిశుధ్యం మెరుగుకు కృషి

తాడిపత్రి రూరల్: స్థానిక కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పారిశుధ్య సెక్రటరీలతో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ సమావేశమయ్యారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు కృషి చేయాలని ఆదేశించారు. పట్టణంలో చెత్తా, చెదారం కనపడకుండా కార్మికులతో ఎత్తి వేయించాలన్నారు. రోడ్డుపై చెత్తను వేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే జరిమానా విధిస్తామన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

కళ్యాణదుర్గం రూరల్: తేనెటీగల పెంపకంపై రెండు నెలల పాటు ఆన్‌లైన్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు కేవీకే శాస్త్రవేత్త రాధాకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి, పట్టుపురుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు hhps://angaru.ac.in వైబ్ సైట్‌లో చూడాలని, అలాగే 8008788776 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.


మానవహారం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది, విద్యార్థులు

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి: డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ వెంకటేస్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం యాడికి వెల్‌నెస్ సెంటర్ వైద్యాధికారి శ్రీరామ్ కుమార్, ఈఓపీఆర్డీ వెంకటేష్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు యాడికి ఉన్నత పాఠశాల విద్యార్థుల చేత ఉన్నత పాఠశాల నుంచి గాంధీజీ విగ్రహం వరకూ డెంగీ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లా డుతూ డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టూ వ్యర్థమైన కొబ్బరి చిప్పలు, పాడైన టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వాస్పత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం


పండ్ల తోటలను పరిశీలిస్తున్న ఎంపీపీ సునీత, ఎంపీడీఓ శోభారాణి

బుక్కరాయసముద్రం: చిన్న, సన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోందని ఎంపీపీ సునీత, ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని సిద్ధరాంపురంలో ఉపాధి పథకం కింద 2021-22లో సాగు చేసిన పండ్ల తోటలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు తక్కువ నీటి వనరులతో పండ్ల తోటలను సాగు చేసుకోవచ్చన్నారు. ఐదు ఎకరాల్లోపున్న రైతులకు ప్రభుత్వం ఉపాధి పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ పోలేరయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు


మాట్లాడుతున్న నిర్వాహకులు

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న సాంస్కృతిక కార్యాక్రమాలు శుక్రవారం ముగిశాయి. రైల్వే ఉద్యోగులు, వారి పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక పోటీల్లో పలువురు ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపమోగపడుతాయన్నారు. విజేతలకు తర్వలోనే బహుమతులను అందజేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్లు ఈఓ రాముడు, జీవీఎం చలపతి, రైల్వే ఇంగ్లిష్ మీడియం ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


విద్యార్థులకు నగదు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంటపల్లి హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు శుక్రవారం పెన్షనర్ల సంఘం నగదు బహుమతులను ప్రదానం చేసింది. అత్యధిక మార్కులు సాధించిన అపర్ణ, గాయత్రి, తనూషకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలను పెన్షనర్ల సంఘం తాడిపత్రి అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్లు ఆదినారాయణస్వామి, వీరారెడ్డి, నరసింహులు, రమణరాజు, కరుణాకర్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె వంక సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.11 వేలను స్వాధీనం చేసుకున్నామని రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు రంగడుతో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని పెన్నానదిలో శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను భూగర్భ గనులశాఖ అధికారులు దాడులు జరిపి స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్లతో పాటు డ్రైవర్లను కేసు నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించారు. వారిపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: పామిడి పెన్నానది నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టీడీపీ నాయకులకు చెందిన మూడు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ బెస్తరాజు, సిబ్బంది అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లలో ఒకటి పామిడి వద్ద, మరో రెండు మండలంలోని జీ కొట్టాల గ్రామం వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.